బహిరంగ సభలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, జయలక్ష్మి, శివారెడ్డి, జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి

సీపీఐ గుంటూరు బహిరంగ సభ దృశ్యమాలిక

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు

బస్సు యాత్రకు గుంటూరు నుంచి వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

సమస్యలను పరిష్కరించాలని కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సివిల్ సప్లయిస్ కార్మికులు

తోపుడు బండ్లు అందజేత

విశాలాంధ్ర-మంగళగిరి : నగరపాలక సంస్థ పరిధిలోని చిన్నకాకాని, మంగళగిరి టిడ్కో గృహాల వద్ద ఆదివారం తోపుడుబళ్లను వైసీపీ నాయకులు అందజేశారు. చిన్నకాకాని, మంగళగిరి తోపుడు బండ్ల మీద వ్యాపారం చేసుకునే వారు రోజు అద్దె కట్టుకోలేక స్థానిక వైసీపీ నాయకులకు తెలపగా వారు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే స్థానిక వైసీపీ నాయకులచే తోపుడుబళ్లను అందజేయించారు.

ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక కొత్తపేటలో ఉన్న మానస హాస్పిటల్, ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘం, మానస స్కిజోఫ్రెనియ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్కిజోఫ్రెనియ వ్యాధి రోగులకు ఉచిత చికిత్స శిబిరం, అవగాహన కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 80మందికి స్కిజోఫ్రెనియ రోగులకు ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘం కార్యదర్శి డాక్టర్ ఇవటూరి శరత్ చంద్ర పరీక్ష చేసి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ఐవియల్ నరసింహారావు మాట్లాడుతూ స్కిజోఫ్రెనియ వ్యాధి తొలి లక్షణాలు గుర్తించడం ఎలా అనే దానిని అవగాహన కల్పించారు. ఆర్థికంగా వెనుకబడిన స్కిజోఫ్రెనియ రోగులకు ప్రతి నెల నాల్గవ ఆదివారం జరిగే ఈ ఉచిత చికిత్స శిబిరంను ప్రజలు ఉపయోగించు కోవాలని ఆయన కోరారు

పవన్ ఫ్లెక్సీలు చింపిన వారిపై ఫిర్యాదు

విశాలాంధ్ర-మేడికొండూరు: జనసేన పార్టీ మేడికొండూరు కార్యాలయం వద్ద కల పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలను శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు చింపి వేశారు. ఈ విషయంపై మండల అధ్యక్షులు రాచర్ల నాగబాబు మేడికొండూరు మండల నాయకులు, గ్రామ అధ్యక్షులు మేడికొండూరు పోలీసువారికి తెలియజేసి వీరిని గుర్తించి తగు విధమైన చర్యలు తీసుకోవాలపి ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో పవన్ కళ్యాణ్‌కి పెరుగుతున్న ప్రజల ఆదరణను చూసి ఓర్వలేక ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కందుల సైదయ్య అన్నారు.

గుండెపోటుతో పాస్టర్ మృతి

విశాలాంధ్ర-మేడికొండూరు: గుండెపోటుతో పాస్టర్ మృతి చెందిన సంఘటన మండలంలోని డోకిపర్రు, శాంతి పాలెంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన లెమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ ఇంటర్నేషనల్ చర్చిలో పాస్టర్‌గా గంగవరపు పుల్లారావు(50) వాక్యోపదేశం చేస్తుంటాడు. ఆదివారం చర్చిలో ఉపన్యసించిన తర్వాత అస్వస్థతతకు గురై ఒక్క సారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహానికి సర్పంచ్ కొండపోగు సామ్రాజ్యం నివాళులర్పించారు.

నేడు నాగళ్ళ, కోటా, యార్లగడ్డల వర్ధంతి

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం కోసం కృషి చేసి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమించి అసువులు బాసిన పోరాట యోధులు నాగళ్ళ రామకృష్ణయ్య, కోటా శ్రీరామ్మూర్తి, యార్లగడ్డ సుబ్బారావుల వర్ధంతి సందర్భంగా వారిని గుర్తుచేసుకుంటూ ప్రజలు కార్యకర్తల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన అమరజీవులు వారి సేవలతో మంగళగిరి ప్రాంతం కమ్యూనిస్టు పార్టీకి ఒక ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. పార్టీ పోరాటాలలో వారి పాత్ర ఎంతో ప్రత్యేకమైనది. ఈ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం అవ్వడానికి వారు నిరంతరం శ్రమించి దాన్యజీవులయ్యారు. వర్ధంతి కార్యక్రమం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తెలిపారు.

వైసీపీ ప్రభుత్వానికి ఘోరీ కట్టేందుకు ప్రజలు సిద్ధం

విశాలాంధ్ర-గుంటూరు : అభివృద్ధిని అటకెక్కించి అరాచకాలతో, దాష్టీకాలతో నవ్యాంధ్రప్రదేశ్ భవిష్యత్‌ని ప్రశ్నార్థకం చేసిన వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, వైసీపీ ప్రభుత్వానికి ఘోరీ కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని గుంటూరు నగర జనసేన పార్టీ అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ అన్నారు. సమస్యలపై సమరభేరి కార్యక్రమంలో భాగంగా 14వ డివిజన్ అధ్యక్షుడు జటావత్ పవన్ నాయక్ ఆధ్వర్యంలో వర్కర్స్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నేరేళ్ళ సురేష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సంక్షేమం ముసుగులో చేస్తున్న అక్రమాలపై ప్రజల్లో అవగాహన పెరగటం శుభపరిణామమన్నారు. వారాహి విజయయాత్రలో పవన్ కళ్యాణ్ సంధిస్తున్న ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానాలు చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగటంపై సామాన్య ప్రజల్లో సైతం ఆగ్రహం నెలకొందన్నారు. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ నిజాయితీపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయ బాబు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా పారిశుధ్య కార్మికుల జీవితాలతో అన్ని రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికుల జీవితాలపై పవన్ కళ్యాణ్‌కు సంపూర్ణ అవగాహన ఉందని, సమస్యల పరిష్కారానికై పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. రాష్ట్ర కార్మిక సంఘ నేత సోమి శంకరరావు మాట్లాడుతూ కార్మికుల, కర్షకుల శ్రమ దోపిడీని అరికట్టాలంటే పేదల కష్టాలు తెలిసిన పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేనకు మద్దతు ఇవ్వాలని ప్రజల్ని కోరారు. అగమ్యగోచరంగా మారిన రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడే నాయకుడు ఒక్క పవన్ కళ్యాణ్ మాత్రమేనని సోమి శంకరరావు అన్నారు. కార్యక్రమంలో రెల్లి యువత రాష్ట్ర నాయకుడు సోమి ఉదయ్ కుమార్, జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి, ఉపాధ్యక్షురాలు బిట్రకుంట మల్లిక తదితరులు పాల్గొన్నారు.

గిడుగు, కందుకూరి, గురజాడల కృషితోనే ఆధునిక సాహిత్యం కాంతివంతం

విశాలాంధ్ర-గుంటూరు : కథయినా కవితయినా మరే ఇతర రచనైనా సమాజ కళ్యాణానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోపడితేనే దానికి సార్థకత చేకూరుతుందని రామరాజు ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ, బాపు-రమణ-బాలు కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో 'కవిమిత్రుల సంగమం-కవి సమ్మేళనం' కార్యక్రమం ఆదివారం సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్(ఎస్‌హెచ్‌ఓ) సమావేశమందిరంలో జరిగింది. ముఖ్యఅతిధిగా హాజరైన రామరాజు మాట్లాడుతూ రచయితలు, కవులు సాహిత్య సృజనలో తమ ప్రాంత అస్తిత్వాన్ని మర్చిపోకూడదన్నారు. అలాగే భావితరాల భవిష్యత్తుకూ బాటలు వేయాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన సుప్రసిద్ధ రచయిత్రి ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయిన కవులే కలకాలం నిలబడతారని, వారి కవిత్వమే కాలాన్ని గెలిచి నిలబడుతుందని అన్నారు. ఆత్మీయ అతిధి బుద్ధభూమి వర్కింగ్ ఎడిటర్ గోలి సీతారామయ్య మాట్లాడుతూ గిడుగు రామమూర్తి, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు ఈ ముగ్గురు మహానుభావుల కలయికల వెలుగు, ఆ సాహిత్య వైతాళికులు చేసిన కృషి మన తెలుగు నేలను, తెలుగు సాహిత్యాన్ని కాంతివంతం చేసిందన్నారు. ఎంఆర్‌వీ సత్యనారాయణమూర్తి రచించిన 'మా పెనుగొండ కథలు' పుస్తకాన్ని సుప్రసిద్ధ కథా రచయిత పెనుమాక నాగేశ్వరరావు సమీక్షిస్తూ వెంటనే వెళ్ళి పెనుగొండను చూసొద్దామన్న ఆసక్తిని రేకెత్తించే విధంగా మా పెనుగొండ కథలను రచయిత రాశారన్నారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ నవ్యాంధ్ర రచయితల సంఘంతో కలిసి గిడుగు జయంతిని రెండు రోజుల ముందు జరుపుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం గిడుగు జయంతి సందర్భంగా బి.జనార్ధన రెడ్డి నిర్వహించిన కవిసమ్మేళనంలో తెలుగుభాష ప్రాభవాన్ని గుర్తుచేస్తూ పలువురు కవులు తమ కవితల్ని వినిపించారు. 'తెలుగు భాషా ప్రాశస్త్యం' కవితను చదివిన మొరుమూరి శేషాచారికి ఉత్తమకవితా బహుమతిని అందజేశారు నిర్వాహకులు. బండికల్లు జమదగ్ని కార్యక్రమాన్ని ప్రారంభం చేయగా, సయ్యద్ జానీబాషా పర్యవేక్షించారు.

గిడుగు జయంతిలో వక్తలు

ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు రింగ్‌రోడ్డులో ఉన్న క్యాపిటల్ హోటల్ నందు ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో సీఎంఈ నిర్వహించారు. కలకత్తా నుంచి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ భాస్కర్ పాల్ గర్భిణీ స్త్రీలలో సిజేరియన్ సెక్షన్ రేటు తగ్గించడానికి... నార్మల్ డెలివరీ రేట్స్ పెంచడానికి తీసుకోవలసిన చర్యలు గురించి... మెటర్నల్ మోటాలిటీ రేట్ తగ్గించడానికి... డెలివరీ తర్వాత తీవ్ర రక్తస్రావం అవ్వకుండా ప్రొటెక్ట్ చేయడానికి అనుసరించాల్సిన పద్ధతుల గురించి... వాడే మందులు గురించి... అలాగే మహిళల్లో ఎగ్గు క్వాలిటీ బాగా తగ్గిపోవడం... ఎగ్ సరిగ్గా లేకపోవడం... వీటి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు... వ్యాయామం గురించి అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ భాస్కర్‌పాల్ మాట్లాడుతూ సాధారణంగా గర్భిణీ 42 వారాల వరకు ఉంటుందని, కానీ మన భారతదేశంలో 39వారాలకే డెలివరీ మొదలుపెట్టినట్లయితే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారన్నది పరిశోధనలో వెల్లడైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ సెక్రటరీ డాక్టర్ ఎస్.ఉమా శంకర్, డాక్టర్ పి.యశోధ, డాక్టర్ సంజనా గోగినేని, డాక్టర్ రావూరి శ్రీహర్ష, డాక్టర్ చంద్రశేఖర్, గుంటూరు నగరంలోని గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

మంగళగిరిలో అమరావతి ప్రెస్ క్లబ్ ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి : స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌కు సమీపంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట జ్యోతి ఎలక్ట్రానిక్స్ పైన సెకండ్ ఫ్లోర్(పాత సిటీకేబుల్ ఆఫీసు)లో ఆదివారం అమరావతి ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ పాత్రికేయులు చెవుల కృష్ణాంజనేయులు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉండే జర్నలిస్టులకు సంబంధించి ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్, హెల్త్ కార్డులు వంటి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర రాజధాని కేంద్రంగా అమరావతి ప్రెస్ క్లబ్ భవిష్యత్తులో కేంద్ర బిందువుగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియలను రాష్ట్రప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు కె.నాగశివ ప్రసాద్, అవ్వారు శ్రీనివాసరావు, కూరపాటి మురళీ రాజులను దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమరావతి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మట్టుకొయ్య కృష్ణ, దామర్ల ఆన్వేష్, ఉపాధ్యక్షులు నువుల శ్రీహరి, సీనియర్ జర్నలిస్టులు మంచికలపూడి శిరిబాబు, ఎన్‌వీ శివన్నారాయణ, శిరందాసు నాగార్జున, బండారు సాంబశివరావు, మెడకాయల మస్తాన్ రావు, ఉద్దంటి రమేష్, కొనేటి వెంకటేష్, అన్నవరపు ప్రభాకర్, వీడేలా వాసు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం మరమ్మతులకు లోకేష్ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని మెల్లంపూడి గ్రామంలో ఉన్న గంగానమ్మ దేవాలయానికి మరమ్మత్తుల నిమిత్తం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తాడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు అమరా సుబ్బారావు, స్థానిక నాయకుల ద్వారా నగదును ఆలయ కమిటి సభ్యులకు ఆదివారం అందజేయించారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ అభ్యర్థన మేరకు నారా లోకేష్ రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆలయ మరమ్మత్తులకు తోడ్పాటు అందించడం పట్ల ఆలయ కమిటి సభ్యులు నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెల్లంపూడి టీడీపీ గ్రామ అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గుంటూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పఠాన్ కాసింఖాన్, తాడేపల్లి మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు బొర్రా కృష్ణ వందన, తాడేపల్లి మండల తెలుగు మహిళా ఉపాధ్యక్షులు సొంటి కళ్యాణి, మంగళగిరి నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు షేక్ ఖాసిం బాబు, మంగళగిరి నియోజకవర్గ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు పఠాన్ జానీ ఖాన్, సొంటి సత్యనారాయణ, సొంటి రామ్మోహన్ రావు, షేక్ నూరుల్లా, వేణుగోపాల్ రెడ్డి, నాగిరెడ్డి, శివ సాంబిరెడ్డి, శనగల కోటిరెడ్డి, దొంతిరెడ్డి శ్రీధర్ రెడ్డి, శనగల వెంకటప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవతా సంస్థలో సభ్యులను పెంచాలి

విశాలాంధ్ర, తెనాలి : ఎయస్ఎన్ డిగ్రీ కళాశాల లైబ్రరీ హాల్లో ఆదివారం మానవత సంస్థలో సభ్యులను పెంచాలి అనే కార్యక్రమం జరిగింది. మానవత రీజినల్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మానవత సంస్థ ఆమేర నిబద్ధతతో పనిచేయడం హర్షణీయమన్నారు. అనతి కాలంలోనే మానవత స్వచ్ఛంద సంస్థ తెనాలిలో వివిధ కార్యక్రమాలలో నిబద్ధతతో పనిచేయడం సంతోషించదగ్గ విషయమని మానవ సంస్థలో సభ్యులను పెంచాలని ఆయన సూచించారు. మానవత ఛైర్మన్ కొలసాని రాంచంద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మానవత సమావేశాల ద్వారా ఆత్మీయ కలియికలు సమావేశాలు తరచుగా జరగాలని ఆకాంక్షించారు. ఈన్నాబత్తుని శ్రీధర్ ఆక్సిజన్ క్రియేటర్స్‌ని మానవత సంస్థకు అందజేశారు. పాఠశాల విద్యార్థులకు నైపుణ్యాల మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నామన్నారు. కార్యక్రమంలో కళ్యాణి, శ్రీనివాసబాబు, ఘట్టమనేని నాగేశ్వరరావు, సోమయ్యశాస్త్రి, వేదాంతం ఫణి, మానవత సభ్యులు పాల్గొన్నారు.

డొక్కా మాణిక్యవరప్రసాద్‌కు సత్కారం

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడుగా నూతనంగా నియమితులైన మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు, నిగర్వి, నిరాడంబరుడు, అందరివాడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను జిల్లా కార్యాలయంలో వైసీపీ నగర మహిళా విభాగం పట్టు శాలువా, పూలదండలతో ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డ్ రాష్ట్ర డైరెక్టర్ గనిక ఝాన్సీ రాణి, మిర్చి యార్డు డైరెక్టర్ కొప్పుల విజయమాధవి, అన్నదాన సత్రం డైరెక్టర్ కొలవెన్ను దుర్గాదేవి, జొన్నలగడ్డ రత్నకుమారి, ప్రసన్న, కారసాని శివపార్వతి, శిరీష, పద్మ, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కశ్మీర్ ఫైల్స్‌కు జాతీయ సమైక్యత అవార్డా?

విశాలాంధ్ర-గుంటూరు : 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రాన్ని 69వ జాతీయ చలనచిత్ర అవార్డులలో జాతీయ సమైక్యతపై ఉత్తమ చలన చిత్రంగా నర్గీస్ దత్ అవార్డుకు ఎంపిక చేయడంపట్ల నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జమీల్ అహ్మద్ బేగ్ ఒక ప్రకటనలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ది కశ్మీర్ ఫైల్స్' జాతీయ సమైక్యతను పెంపొందించే చిత్రమా అని ఆయన ప్రశ్నించారు. ముస్లింలను, కశ్మీరీలను దుర్భాషలాడుతూ, విద్వేషాలను రెచ్చగొట్టేలా చిత్రీకరించిన ఈ కల్పిత చిత్ర ప్రదర్శన తర్వాత విద్వేష పూర్తి వాతావరణం ఏర్పడిరదన్నారు. కల్పిత కథతో నిర్మించిన చిత్రాన్ని ప్రధాని మోదీ పెంచి పోషిస్తున్నారని, ఇటువంటి చిత్రాలను ప్రోత్సహించడమే ధ్యేయంగా పెట్టుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. విద్వేషాలను రెచ్చగొడుతూ సమాజంలో తప్పుడు అభిప్రాయాలను సృష్టించే ఈ చిత్రానికి జాతీయ సమైక్యతా అవార్డును ప్రకటించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అది కూడా భిన్న మతాలకు, భిన్న భాషలకు నెలవైన భారత్‌లో ప్రజల మధ్య సమైక్యత కోసం విశేషంగా కృషిచేసిన నర్గీస్‌దత్ పేరిట ఇచ్చే అవార్డుకు ఈ చిత్రాన్ని ఎంపిక చేయడాన్ని జమీల్ అహ్మద్ బేగ్ తీవ్రంగా విమర్శించారు.

మూడు రోజుల సదస్సులు విజయవంతం

విశాలాంధ్ర-గుంటూరు : వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం, అవర్ స్టేట్ అవర్ లీడర్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో మూడు రోజుల పాటు జరిగిన సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం సదస్సులు విజయవంతమైనట్లు ఫోరం వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు విశాఖపట్నం, శ్రీకాకుళం, పాడేరులో శాంతమూర్తి, విశ్రాంత వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బాల మోహనదాస్ అధ్యక్షతన జరిగిన సదస్సులకు ముఖ్యఅతిధులుగా ఏపీ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పాడేరు డీఈఓ షేక్ సలీం బాషా తదితరులు హాజరైనట్లు వెల్లడించారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతి

విశాలాంధ్ర-గుంటూరు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రపంచ శాంతి దూత మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఏఐఎస్ఎఫ్ విశ్వవిద్యాలయ అధ్యక్షులు పాలం నాసరయ్య మాట్లాడుతూ కుష్టు వ్యాధి రోగులను ఆదరించిన మహోన్నత వ్యక్తిగా ప్రపంచ దేశాలు ఆమె సేవలను గుర్తు చేసుకోవాలన్నారు. మదర్‌థెరిస్సా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ అనే సంఘాన్ని స్థాపించారని, హెచ్‌ఐవీ/ఎయిడ్స్, కుష్టువ్యాధి, క్షయవ్యాధితో మరణిస్తున్న వ్యక్తుల కోసం సమాజ గృహాలను నిర్వహించారని, పిల్లలు, కుటుంబ సలహా కార్యక్రమాలు, అలాగే అనాథ శరణాలయాలు, పాఠశాలలను కూడా నిర్వహించారని, నిరుపేదలకు హృదయపూర్వక ఉచిత సేవను చేసి మదర్ థెరిస్సా భారత పౌరసత్వాన్ని స్వీకరించారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అవినాష్, ఉపాధ్యక్షులు వసంత్ నాయక్, సురేఖ, ఖాసిం, సహ కార్యదర్శులు ప్రసాద్, చైతన్య నాయక్, కోశాధికారి వాగ్య నాయక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ది గుంటూరు జిల్లా ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆస్టల్ రమేష్ హాస్పటల్ వారి సహకారంతో ది చేబ్రోలు మండల ఎరువులు, పురుగు మందుల డీలర్ల సంఘం సహకారంతో ఆదివారం ఉదయం చేబ్రోలులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 575 మంది ఈ ఉచిత వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు కూడా అందజేశారు. గుంటూరు జిల్లా ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వజ్రాల వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ కారణం చేతనైనా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.రోశయ్య, కోశాధికారి బాలకృష్ణారెడ్డి, జిల్లా చైర్మన్ సీహెచ్.రవికుమార్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శిష్టా సుబ్రహ్మణ్యం, రెవెన్యూ డివిజన్ చైర్మన్ కోసూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు చలపతిరావు, పీవీ సత్యనారాయణ, సత్తెనపల్లి సంఘం అధ్యక్షులు పెరుమాళ్ళ శివన్నారాయణ, చేబ్రోలు, చుండూరు మండల ఎరువులు, పురుగు మందుల డీలర్లు వీరయ్య, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-చేబ్రోలు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహన్ని చేబ్రోలు అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటం హర్షనీయం అని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. చేబ్రోలు లోని జీబీసీ రోడ్డు లోని పాత పోలీస్ స్టేషన్ వద్ద నూతనంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహన్ని ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహన్ని ఆవిష్కరించటం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్ట్‌ను సంక్షోభంలోకి నెట్టిన కేంద్ర, రాష్ట్ర పాలకులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పోలవరం బహుళార్థక సాధక ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షోభంలోకి నెట్టాయని జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. జన చైతన్య వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో 'పోలవరం ప్రాజెక్టు పురోగతి'పై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వ్యవసాయ రంగ నీటిపారుదల నిపుణులు అక్కినేని భవానీ ప్రసాద్ మాట్లాడుతూ బచావత్ అవార్డులో ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు 150 అడుగుల ఎత్తును తగ్గించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల నుండి 41.15 మీటర్లకు తగ్గిస్తే నీటి నిలువ సామర్థ్యం 196 టీఎంసీల నుండి 75 టీఎంసీలకు తగ్గుతుందని పేర్కొన్నారు. కుడి, ఎడమ కాలువలకు నీరు గ్రావిటీ ద్వారా ప్రవహించదని, లక్ష మందికి పైగా ఉన్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పూర్తి నష్ట పరిహారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలన్నారు. 1835లోనే సర్ ఆర్థర్ కాటన్ గోదావరిపై రిజర్వాయర్‌ను నిర్మించాలని 1941లోనే మద్రాసు రాష్ట్ర ప్రధాన ఇంజనీర్ దివాన్ బహదూర్ ఎన్ వెంకటకృష్ణ అయ్యర్ పోలవరం ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు తెలిపారు. 1946-47లో ప్రముఖ ఇంజనీర్ కెఎల్ రావు రామపాద సాగరంగా పేర్కొన్నారని, 2005లో నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి త్వరితగతిన పోలవరం ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లారని, అయితే 2009 నాటికి అన్ని అనుమతులు పూర్తి చేసినట్లు చెప్పారు. 2014 నుండి 2019 వరకు పోలవరం ప్రాజెక్టు వేగంగా అభివృద్ధి చెందిందని, 72శాతం పూర్తి చేస్తే గత 50 నెలలుగా వైఎస్ జగన్ ప్రభుత్వం మూడు శాతానికి మించి పనులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ సామాజిక విశ్లేషకులు, సామాజిక ఉద్యమకారులు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2014-2019 మధ్య నాటి ప్రభుత్వం పోలవరంపై రూ.11,450 కోట్లు వెచ్చిస్తే నేటి ప్రభుత్వం గత 50 నెలలలో రూ.4450 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. నిర్వాసితులకు పునరావాస కల్పన కోసం రూ.33 వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ. 7వేలు కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు అమలుకు మించిన సంక్షేమ కార్యక్రమం మరొకటి లేదన్నారు. కోట్లాది ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచే జీవనాడి పోలవరం అని, రూ.10 లక్షల కోట్లు అప్పు చేసిన రాష్ట్ర ప్రభుత్వం రూ.2.5 లక్షల కోట్ల ధనాన్ని నేరుగా ప్రజల ఖాతాల్లోకి పంపిన రాష్ట్ర ప్రభుత్వం వీటిలో 20 శాతం నీటిపారుదల ప్రాజెక్టులపై వెచ్చిస్తే ఆంధ్రప్రదేశ్‌లోని 106 నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, బిసీ మహాజన సభ నేత ఉగ్గం సాంబశివరావు, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ పి పోతురాజు, తెలుగు అధ్యాపకులు డాక్టర్ సింగారావు, తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో వ్యవసాయ మోటార్ల అపహరణ

విశాలాంధ్ర-తాడేపల్లి : ఒకే రోజు ఒకే ప్రాంతంలో 5 వ్యవసాయ మోటార్లను చాలా చాకసక్యంగా అపహరించిన సంఘటన ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. మూడు నెలల వ్యవధిలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు అపహరణకు గురి అవ్వటం ఇది రెండవసారి. కుంచనపల్లి గ్రామ పంట పొలాలలో వరుస విద్యుత్ మోటర్లు అపహరణకు గురి అవ్వడంతో గ్రామంలోని రైతాంగం బెంబేలెత్తుతున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన అమ్మిశెట్టి సుబ్బారావు, బొడ్డు ప్రసాద్, అమ్మిశెట్టి శివ నాగేశ్వరరావు, అమ్మిశెట్టి అర్జున్, కుక్కమల్ల సామ్యూల్ అనే రైతుల పొలాలలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు అపహరణకు గురయ్యాయి. ఆదివారం ఉదయం రైతులు తమ పొలాలలోని వ్యవసాయ విద్యుత్ మోటర్లు అపహరణకు గురి అవడంతో నిర్ఘాంతపోయారు. అనంతరం తాడేపల్లి పోలీసులకు మోటార్ దొంగతనాలపై ఫిర్యాదు చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతులు తామిక వ్యవసాయం చేయలేమంటూ ఆవేదన చెందుతున్నారు. ఒక్కో మోటార్ ఖరీదు రూ.50 వేలకు పైబడే ఉంటుందని, అసలే వ్యవసాయ పెట్టుబడులు పెరిగి అనేక ఇబ్బందులుపడుతున్న తమకు వ్యవసాయ విద్యుత్ మోటర్లు అదనంగా కొనుక్కునే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు.

కుంచనపల్లిలో వ్యవసాయ విద్యుత్ మోటర్లు అపహరణకు గురైన విషయం తెలుసుకున్న సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి తాడేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న, రైతుల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే తాడేపల్లి పోలీసులు వ్యవసాయ విద్యుత్ మోటార్ల దొంగతనాలను అరికట్టాలని, వరుస మోటార్ దొంగతనాలపై దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని తాడేపల్లి సీఐ శేషగిరిరావుని ఆయన కోరారు.

కళాశాలలో ఉచిత ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర, తెనాలి : జె.యం.జె మహిళాకళాశాలలో తెనాలి ఐయంఎ మిషన్ పింక్, హ్యాపీ హాస్పటల్, ఇండియన్ రెడ్‌క్రాస్, జె.యం.జె.రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరం, అవగాహనా కార్యక్రమం ఆదివారం జరిగింది. ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైనీ అధ్యక్షత వహించారు. ఆరోగ్య సమస్యలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. డా.శ్వేత గైనకాలజిస్ట్, డా.ప్రియాంక, డా.లావణ్య, డా.ఉష ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. అనీమియా నివారణకు మందులు పంపిణీ చేశారు. మహిళల్లో క్యాన్సర్ గుర్తించడానికి అవగాహన కల్పించారు. నిర్వాహకులు యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పాటిబండ్ల హేమలత, డా.కె.అరుణ సుజాత, సిహెచ్. సరోజిని, డా.అమూల్ మేరి, విజయ, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

టీడీపీ భవిష్యత్తుకు గ్యారంటీ

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్ర టీడీపీ ఇచ్చిన పిలుపుమేరకు పల్నాడు జిల్లా టిడిపి అధ్య క్షులు, మరియు వినుకొండ మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు వినుకొండ తెలుగు మహిళ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భవిష్యత్తు గ్యారెంటీ ఇస్తూ తెలుగుదేశం పార్టీ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్దేశంతో పట్టణంలోని 5 వార్డు కొత్తపేటలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు 1500, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలు వివరించారు. ముఖ్య అతిథులుగా క్లస్టర్ ఇంచార్జ్ పి.వి.సురేష్ బాబు, వార్డు కౌన్సిలర్ పి.అంజలి దేవి, బి.సుబ్రహ్మణ్యం, వార్డ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, బూత్ కన్వీనర్ డి.రాజా, యూత్ ప్రెసిడెంట్ మన్నం ఆదిలక్ష్మి, పల్నాడు జిల్లా తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు ముప్పూరి చౌడమ్మ, వినుకొండ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు బొట్లగుంట లక్ష్మి, వినుకొండ టౌన్ మహిళా అధ్యక్షురాలు చెవల సుబ్బులు, ఈశ్వరమ్మ, శివకుమారి, రమణమ్మ, బొమ్మిశెట్టి అన్నపూర్ణ, వడ్లమూడి లక్ష్మమ్మ పాల్గొన్నారు.

విచిత్ర వేషధారణతో ఘన స్వాగతం

విశాలాంధ్ర-నరసరావుపేట : రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బస్సు యాత్ర ఆదివారం నరసరావుపేట వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ ఆధ్వర్యంలో విచిత్ర వేషాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ భాయ్ భాయ్ అంటూ దీనితోపాటు పల్నాడు జిల్లా ఉట్టిపడేలా పల్నాడు బ్రహ్మానాయుడు నాయకురాలు నాగమ్మ, కన్నమ్మ, దాసు, ఝాన్సీ, రుద్రమదేవి, అల్లూరి సీతారామరాజు, మాయల పకీర్, యమధర్మరాజు, చిత్రగుప్తుడుతో పాటు వివిధ వేషధారణలతో ప్రజలను ఎంతగానో ఆకర్షింపచేసింది. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా అధ్యక్షులు మద్దుకూరి నాయకత్వం వహించారు.

లాప్‌టాప్ అందజేత

విశాలాంధ్ర-పెదకూర పాడు : మండల పరిధిలోని హుస్సేన్ నగరం గ్రామానికి చెందిన తూమాటి వెంకటేష్‌కు ఉద్యోగ శిక్షణ, ఉన్నత ఉద్యోగం కోసం ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ సహకారంతో లాప్‌టాప్ అందించినట్లు మాగులూరి ఫౌండేషన్ చైర్మన్ ఎం.కృష్ణారావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి మాగులూరి ఫౌండేషన్ సహాయ సహకారాలు ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు కిరణ్ కుమార్, కొండవీటి ప్రసాదు, శ్రీనివాసరావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు సక్రమంగా చెల్లించాలి

విశాలాంధ్ర-వినుకొండ: ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ, పిజిటిలకు మూడు నెలలుగా జీతాలు రాని విషయం తెలిసిందే. అనేకమార్లు ప్రభుత్వ దృష్టికి సంఘంపరంగా, ఉమ్మడి ఉద్యమాల పరంగా తీసుకెళ్లినా నేటికి కూడా జీతాలు రాని కారణంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మూడు నెలల జీతాల మంజూరుకై ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు వినుకొండ శివయ్య స్థూపం సెంటర్ వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏ.పి.టి.ఎఫ్ 1938 పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.శివ నాగరాజు, గౌరవ అధ్యక్షుడు పమ్మి వెంకట రెడ్డి వివిధ మండలాల కార్యకర్తలు టి.శ్రీనివాస రావు, ఏ వెంకట రెడ్డి, బి ఓ.రాజేశ్వరరావు, వి.ఆంజనేయులు, నారాయణ రెడ్డి, ఎం.ఆంజనేయులు, టి.శ్రీనివాసరావు, ఎం.వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు హర్షనీయం

విశాలాంధ్ర-చేబ్రోలు: వైద్య శిబిరం నిర్వహించటం హర్షనీయం అని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. చేబ్రోలు ఎస్ఎన్‌జీజే పాఠశాలల్లో ఆదివారం జిల్లా పర్టిలేజర్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరం నిర్వహించటం వలన పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రానున్న రోజులలో మరన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మందుల పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక మందపాడులోని నిరశ్రాయుల కేంద్రంలో ఆదివారం పెనుమోతు వంశీ ఆధ్వర్యంలో వృద్దులకు ఉచితంగా బిపి, షుగర్, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పెనుమోతు శ్రీనివాసరావు వర్థంతిని పురష్కరించుకుని వృద్దులకు ఉచితంగా రక్త పరీక్షలను డా.జాగేశ్వరరావు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎన్‌టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు లోయ ఈశ్వరవెంకటేశ్వరరావు, అర్జా ప్రసాద్, పొన్నూరు సత్యనారాయణ, లింగం చిట్టిబాబు, బొప్పన కుటుంబరావు, చింతా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వినుకొండ బహిరంగ సభ దృశ్యమాలిక

బస్సు యాత్రకు సీపీఐ, టీడీపీ నాయకుల ఘన స్వాగతం

విశాలాంధ్ర-నరసరావుపేట : దేశాన్ని కాపాడండి - రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం పల్నాడు జిల్లాకు చేరుకుంది. జిల్లా కేంద్రమైన నరసరావుపేట సరిహద్దులోని సాతులూరు, జొన్నలగడ్డ గ్రామాల వద్ద సీపీఐ నాయకులు, టీడీపీ నాయకులు బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు లకు పూలదండలు, హారతులతో మహిళలు, రైతులు, కార్మికులు ఘన స్వాగతం పలికారు. బస్సు యాత్రలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ శ్రేణులు ద్విచక్ర వాహనాలకు జెండాలు పెట్టుకుని నినాదాలు చేస్తూ పాల్గొన్నారు. పట్టణంలోని మల్లమ్మ సెంటర్‌కు

చేరుకున్న బస్సు యాత్రకు ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా ఖ్యాతిని తెలియజేస్తూ, పల్నాటి చరిత్రకు తార్కాణంగా నిలిచే బ్రహ్మానాయుడు, నాయకురాలు నాగమ్మతో పాటు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న నాయకుల వేషధారణలతో స్వాగతం పలికారు. సత్తెనపల్లి రోడ్డు నుంచి కనక తప్పెట్లతో, బాణాసంచాతో పార్టీ నాయకులు బస్సు యాత్రను ర్యాలీగా జమిందార్ ఫంక్షన్ హాల్‌కు తీసుకెళ్లారు. ర్యాలీలో పెద్దఎత్తున పార్టీ నాయకులు, మహిళలు, కార్మికులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఏఐవైఎఫ్ నాయకులు రాజేంద్ర, లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివారెడ్డి, పెంచలయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, ప్రజానాట్యమండలి నాయకులు బి.రామకృష్ణ, సిహెచ్ నిర్మల, ఎం.సుబ్బమ్మ, షేక్ సుభాని, మునుగోడు శ్రీనివాసరావు, రవిబాబు, వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, ఎస్కే చిన్న జాను సైదా, అంజనీ దేవి, రత్నమాల పాల్గొన్నారు.

టీడీపీతోనే మన భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టీడీపీతోనే ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రజల భవిష్యతుకు గ్యారెంటీ ఉంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోవెల మూడి రవీంద్ర (నానీ) అన్నారు. ఆదివారం జిల్లా టిడిపి కార్యాలయంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలతో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' 45రోజుల కార్యక్రమం విజయవంతం చేయటంపై వారికి శిక్షణనిచ్చారు. ఈ సందర్భముగా కోవెలమూడి మాట్లాడుతూ... పేదలను ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబనకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు మహానాడులో ప్రకటించిన మ్యానిఫెస్టో చేయూత నిస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డ నిధి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి తల్లికి ఏడాదికి రూ.15వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలుజేస్తామన్నారు. పరిశీలకులు కనకాచారి, నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ మాట్లాడుతూ యువతకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన అన్యాయాలపై టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన వస్తోందన్నారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పలకలూరి శివరావుకు అవార్డు

విశాలాంధ్ర-గుంటూరు : నగరానికి చెందిన సేవాతత్పరుడు, విశ్రాంత ఉద్యోగి పలకలూరి శివరావు ఏడు పదుల వయస్సులో కూడా కరోనా విపత్కర పరిస్థితులలో పలు సేవా సంస్థలతో కలిసి పేదలు, బాధితులు, రోగులకు నిత్యావసర సరుకులను, హోమియో మందులు, రొట్టెలు, దుస్తులు అందజేశారు. శివరావు సేవలను గుర్తించి అఖిలభారత ఎన్‌జీఓస్ సంక్షేమ సంఘం, కేబీఆర్ ఫౌండేషన్ 5వ వార్షికోత్సం సందర్భంగా ఆదివారం ఏసీ కాలేజీ ప్రాంగణంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు కె.బాలరాజు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధరరావు, ప్రముఖ రచయిత గంగాశ్రీ శివరావును శాలువా, మెమొంటో, పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

కాశయ్యను పరామర్శించిన గౌడ సంఘం ప్రతినిధులు

విశాలాంధ్ర-తాడేపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలుకి ఫ్యాక్చర్ అయి ఆపరేషన్ చేయించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్యను ఆదివారం తాడేపల్లి గౌడ సంఘ ప్రతినిధులు రామ్ ఆస్పటల్ అధినేత పలగాని శ్రీనివాసరావు, మండల గౌడ్ సంఘం నాయకులు అధ్యక్షులు లచ్చి తులసీదాసు, జోగి సుధాకర్, దాసరి సుధాకర్ రావు,తదితరులు కాశయ్య ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గ్రామ దేవతకు పూజలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల పరిధిలోని తమ్మవరం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు తెల్లవారుజామున పుణ్య స్నానాల ఆచరించి భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. జల బిందలతో గ్రామ దేవత విగ్రహాలకు డప్పు వాద్యాలతో తీన్మార్ వాయిద్యాలతో ధర్మవరం పురవీధుల్లో ప్రభలు కట్టి పూజ నిర్వహించారు. మహిళ భక్తులు పాల్గొని గ్రామదేవతల కృపకు పాత్రులయ్యారు.

అగ్నిప్రమాద బాధితులకు మండలి వెంకట్రామ్ సాయం

విశాలాంధ్ర-అవనిగడ్డ: అవనిగడ్డ భారతి హాస్పిటల్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబా లకు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ సహాయం అందించారు. బాధిత కుటుం బాలను వెంకట్రామ్ పరామర్శించి ప్రమాద కారణాలు అడిగి తెలుసుకు న్నారు. అగ్నిప్రమాద బాధితులు కేసన కృష్ణకుమారి, సూరగం నాగమల్లీశ్వరిలకు ఆర్థిక సాయం, దుస్తులు అందించారు. ఆయన వెంట చెన్ను గాంధీ, మండలి రామ్మోహన్‌రావు, చెన్ను బాబురావు, మండలి బలరాం, చెన్ను బుల్లియ్య తదితరులు ఉన్నారు.

లలితా హాస్పిటల్‌లో అత్యాధునిక 'కార్డియో, క్యాన్సర్' వైద్య సేవలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగం అన్ని వయస్సుల వారికి ప్రాథమిక, ఆధునాతన గుండె, వాస్కులర్ సమస్యలకు ఆధునిక రోగ నిర్ధారణ, చికిత్స పద్ధతులను అందుబాటులోకి తెచ్చినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ న్యూరాలజిస్ట్ విజయ పమిడిముక్కల, ఎండో వాస్క్యులర్ ఇంటర్వెన్షనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాగ్, ఆంకాలజి విభాగాధిపతి డాక్టర్ స్రవంతిలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం హాస్పిటల్ ప్రాంగణంలో అడ్వాన్స్‌డ్ కార్డియో వాస్క్యులర్ క్లినిక్ వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో అత్యాధునిక కార్డియాలజీ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కరోనరీ అండ్ పెరిఫెరల్ వాస్క్యులర్ వ్యాధులు

పరీక్షించడంలో ఆధునిక ట్రాన్స్‌థొరసిక్, ట్రాన్స్ ఈసోఫేజియల్ ఎకో కార్డియోగ్రామ్‌తో పాటు నూతన సీమెన్స్ మల్టీ డిటెక్టర్ సీటీ స్కాన్ సహాయపడుతుం దన్నారు. సంకిష్ట కరోనరీ వ్యాధుల నిర్వహణ కోసం ఇంట్రా వాస్క్యులర్ అల్ట్రా సౌండ్, ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీలను ఆధునాతన క్యాథ్‌లాబ్‌కు జోడించడం వల్ల ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. భారతదేశంలో ప్రతి 9మందిలో ఒకరికి జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, డే కేర్, కీమోథెరపీతో ఇన్-పేషంట్ మామోగ్రామ్, కొలనోస్కోపీ, బ్రోంకో స్కోపీ, ఎండోస్కోపీ, కాల్పోస్కోపీ, హెచ్ఆర్‌సీటీ చెస్ట్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, లాబరేటరీ సేవలు, స్క్రీనింగ్ డయాగ్నోస్టిక్ సేవలు అన్నీ లలితా హాస్పిటల్‌లో సామాన్యులకు అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. భారత్‌లో ఏడాదికి 15 లక్షల మంది క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, రొమ్ము, ఊపిరితిత్తులు, పెద్దపేగు, గర్భాశయ వంటి అన్ని రకాల క్యాన్సర్లకు అత్యాధునిక వైద్య అందుబాటులో తెచ్చినట్లు వారు పేర్కొన్నారు.

శ్రీ కృష్ణా అడ్వాన్స్ స్కానింగ్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : అత్యాధునిక టెక్నాలజీతో అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లు తీయనున్నట్లు డాక్టర్ మారిశెట్టి రాజ్యలక్ష్మి(రేడియాలజీ) తెలిపారు. ఆదివారం సత్తెనపల్లిలో సుజాత లక్ష్మీ హస్పిటల్ పక్కన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ చల్లం చెర్ల సాంబశివరావు, వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్‌లు కలసి శ్రీ కృష్ణా అడ్వాన్స్ స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లంచెర్ల సాంబశివరావు మాట్లా డుతూ సత్తెనపల్లిలో ఆధునిక టెక్నాలజీతో ప్రజలకు స్కానింగ్ సెంటర్ అందుబాటులో ఉండటం ఎంతో ఆనందకరమైన విషయమని అన్నారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ మానవుల శరీరంలోని వ్యాధి మూలాలను గుర్తించి, వారికి త్వరితగతిన వైద్యం అందేలా చేయడమే అల్ట్రా సౌండ్ స్కానింగ్ ముఖ్య ఉద్దేశమని, సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు ఎక్కువగా జీవనం సాగిస్తూ ఉంటారని, వారి అవసరాల నిమిత్తం ఈ స్కానింగ్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గుంటూరు నగరంలో ఏ విధమైన స్కానింగ్ సౌకర్యాలు ఉంటాయో వాటికి ఏ మాత్రం తగ్గకుండా డాక్టర్ రాజ్యలక్ష్మీ స్కానింగ్, వైద్య సేవలు నిర్వహిస్తారని తెలిపారు. డాక్టర్ రాజ్యాలక్ష్మీ మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అల్ట్రా సౌండ్ స్కానింగ్ ద్వారా పెనరొమిక్ వ్యూ, మైక్రో వ్యాస్కిలర్, డాప్లర్ స్టడీస్‌కు సంబంధించిన స్కానింగ్‌లు స్పష్టంగా వస్తాయని అన్నారు. ముఖ్యంగా గర్భవతులకు సంబంధించిన స్కానింగ్‌లు, బయో ఫిజికల్ టెస్ట్‌లు, శరీరంలో ఏర్పడే కణితలు, పక్షవాతం, డయాలసిస్, కాళ్ళనరాలు, థైరాయిడ్, మొదడు నుంచి పాదాలకు ఉండే నరాలకు సంబంధించిన ఇబ్బందులు, సంతానం లేని మహిళలకు ఫాలిక్యూలార్, కిడ్నీలో రాళు ్ళ, లివర్‌లో కణితలు, ప్రేగుల్లో ఇబ్బందుల గురించి స్కానింగ్ ద్వారా తెలుసుకోవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వంగా రాజగోపాల్ రెడ్డి, డాక్టర్ చిట్టెం లక్ష్మణ్, డాక్టర్ కంతా జగదీష్, తోట రంగారావు, గుడి సతీష్ కుమార్, పుల్లగుర చంద్రశేఖర్, కదిరి గణేష్, గాజుల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సుయాత్రకు ఘన స్వాగతం

విశాలాంధ్ర- చిలకలూరిపేట/ నాదెండ్ల: రాష్ట్రాన్ని రక్షించు కుందాం, దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో కొనసాగుతన్న సీపీఐ బస్సు యాత్ర ఆదివారం చిలకలూరిపేట నియోజకవర్గంలోని నాదెండ్ల మండలం సాతులూరు వద్ద పల్నాడు జిల్లాలో ప్రవేశించింది. సాతులూరులో చిలకలూరిపేటకు చెందిన సీపీఐ శ్రేణులు పెద్ద

సంఖ్యలో పాల్గొని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల కుమార్ బృంధానికి ఘన స్వాగతం పలికారు. యాత్రకు మహిళలు మంగళహారతులు పట్టి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. యాత్ర ద్విగ్విజయం కావాలని ఆకాంక్షించారు. ముందుగా చిలకలూరిపేట సీపీఐ కార్యాలయం వద్ద నుంచి పలుజీపులతో, ద్విచక్రవాహనాలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, సీనియర్ పార్టీ నాయకుడు రావిపాటి వెంకటేశ్వరరావు(ఆర్‌వీ), నాయకులు పేలూరి రామారావు, దాసరి వరహాలు, చెరుకుపల్లి నిర్మల, కాసా సాంబయ్య, తూబాటి సుభాని, బొంతా భగత్ సింగ్, నాయుడు శివకుమార్, మంత్రునాయక్, గాత్రం భగత్‌సింగ్, లక్షాధికారి, యోగయ్య, శరబయ్య, లలితకుమారి పల్నాడు జిల్లా నరసరావుపేట నుంచి పల్నాడు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు ఆధ్వర్యంలో పలువురు నాయకులు భారీగా తరలివచ్చి స్వాగతం పలికారు.

నైపుణ్యాలను వెలికితీసేందుకే బాలోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి : బాలబాలికల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకే మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ తెలిపారు. తాడేపల్లి పట్టణంలోని అమరావతి ఐకాన్‌లో ఆదివారం ఎంటీఎంసీ బాలోత్సవం ఆధ్వర్యంలో గణితంలో ప్రాథమిక అంశాలపై అవగాహన క్లాసును గణితంలో నిష్ణాతులైన లెక్చరర్ ఎస్.లెనిన్ బాబు బోధించారు. అపార్టుమెంట్స్, వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్వహించిన తరగతుల ముగింపు సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడారు. మాస్టర్ లెనిన్ పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోర్డుపై థియరీ చేసి చూపించిన తీరు బాగుందన్నారు. మాస్టర లెనిన్ బాబు మాట్లాడుతూ ముందు లెక్కలంటే భయం విడనాడాలన్నారు. చేయగలమనే ధైర్యంతో ముందుకు వెళ్తే సాధించలేనిది ఏమీ లేదని చెప్పారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లలు తమ ఏకాగ్రతను చదువుపై పూర్తిగా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే తాము అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని చెప్పారు. బాలోత్సవం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దలు యడ్ల బాలకృష్ణ, షితిజ, గౌతమి, పి.సుధారాణి, శ్రీలక్ష్మి, గుప్తా, సిహెచ్ వెంకటరావు, చంద్రలేఖ తదితరులు పాల్గొన్నారు.

'గిడుగు' పురస్కారానికి రమణ యశస్వి ఎన్నిక

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు నగరానికి చెందిన ఆర్థోపెడిక్ విభాగం ఆచార్యులు డాక్టర్ రమణ యశస్వి 'గిడుగు రామ్మూర్తి' పురస్కారానికి ఎంపికైయ్యారు. వివరాల్లోకి వెళితే వ్యావహారిక భాషా పితామహుడుగా పేరు గాంచిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికార భాషా దినంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా ఒక తెలుగు పుస్తకాన్ని ప్రచురిస్తూ 'న్యూమటిక్కులు'అనే కొత్త కవితా ప్రక్రియ రూపశిల్పి అయిన డాక్టర్ రమణ యశస్విని ఈ సందర్భంగా గిడుగు పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికార భాష సంఘం అధ్యక్షులు విజయబాబు తెలియజేశారు. డాక్టర్ రమణ యశస్వి గుంటూరు వైద్య కళాశాలలో ఆర్థో విభాగాధిపతిగా ఉన్నారు. అధికార భాష సంఘ సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు రమణ యశస్విని అభినందించారు.

మైనార్టీ హక్కుల సమావేశం

విశాలాంధ్ర-పెదన : పెదన పట్టణంలోని మైనార్టీ హక్కుల వేదిక కార్యాలయంలో ఆదివారం పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ హక్కుల వేదిక అధ్యక్షులు ఎండి సిద్దిక్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం కేంద్ర మైనార్టీ సంక్షేమ శాఖ వారిచే మైనార్టీ విద్యార్థులకు అందించే ఎన్.యస్.పి సెంట్రల్ మైనార్టీ ప్రీ మెట్రిక్ అండ్ పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్‌షిప్‌లు 2022-23వ సంవత్సరానికి ఆన్‌లైన్ చేసుకున్న విద్యార్థులు ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు గతంలో ఇచ్చేవారు కానీ 2022-23వ సంవత్సరంలో ఒకటో తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఆన్‌లైన్ చేయించుకున్న తరువాత క్యాన్సల్ చేశారు. తొమ్మిదో తరగతి నుండి డిగ్రీ వరకు చదివే విద్యార్థులకు గత సంవత్సరం రావాల్సిన స్కాలర్‌షిప్ డబ్బులు విద్యార్థుల ఖాతాలలో 2023వ సంవత్సరం జనవరి నెలలో పడాల్సిన డబ్బులు ఇంతవరకు పడలేదు ఈ సంవత్సరం కొత్తగా ఆన్లైన్ చేయించుకునే సమయం మొదలైనప్పటికీ కొత్తగా ఉన్నత ప్రధానోపాధ్యాయులు బయోమెట్రిక్ వేసిన తరువాత విద్యార్థులు బయోమెట్రిక్ వేయాలని కొత్తగా నిబంధన పెట్టడం వలన ఇంతవరకు విద్యార్థుల అకౌంట్లో డబ్బులు పడలేదు దీనిపై కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి మరియు మండల విద్యాశాఖ అధికా కార్లు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్కాలర్షిప్పులపై అవగాహన కల్పించవలసిందిగా పత్రికా ముఖంగా కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎండి సిద్దిక్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ వి అప్పారావు మైనార్టీ నాయకులు ఎండి ఇలియాస్ అబ్దుల్ హాఫీజ్ ఎండి పాషి షేక్ మతీన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో మిస్టర్ పోలిశెట్టి చిత్ర యూనిట్ సందడి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : విజయవాడ నగరంలో హీరో నవీన్ పోలిశెట్టి హీరోయిన్ అనుష్క జంటగా నటించిన మిస్టర్ పోలిశెట్టి చిత్రం యూనిట్ సందడి చేసింది. ఆదివారం నగరంలోని ఓ హెూటల్‌లో ఆ చిత్రం ప్రమోషన్ లో భాగంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆచిత్ర హీరో నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూమిస్టర్ పోలిశెట్టి చిత్రం ప్రమోషన్ కార్యక్రమాన్ని విజయవాడ నగరం నుంచి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విజయవాడ నగరం తో తనకెంతో అనుబంధం ఉందన్నారు.చదువుకున్న రోజుల్లో విజయవాడలోనే ఎక్కువగా ఉండేవాడిననీ పేర్కొన్నారు.మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి చిత్రం కు సంబంధించిన టీజర్ ట్రైలర్ కు ఇప్పటికే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.ఈ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందనీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 7న సినిమాను రిలీజ్ చేయనున్నామని తెలిపారు.

విద్యావ్యవస్థను నాశనం చేసే జీవో 117 రద్దు చేయాలి

- పాత పెన్షన్‌పై ముఖ్యమంత్రి మాట తప్పితే తిరగబడతాం
- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : విద్యా వ్యవస్థను నాశనం చేసే జీవో నెం 117ను వెంటనే రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బదుగు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తిమ్మన్న మాట్లాడుతూ పాధమిక పాఠశాలలల్లో విద్యనభ్యసించే మూడు నాలుగు తరగతులు విలీనం చేయకూడదని ఎన్నిసార్లు విన్నవించిన ప్రభుత్వం ఏ మాత్రం పరిగణించకుండా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4800 పాఠశాలను బలవంతంగా విలీనం చేశారన్నారు. దాని ఫలితంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు వదిలివేసి ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయన్నారు. ఈ చర్యను ఎస్టీయూ సంఘం తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ రాష్ట్రంలో ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించటం కంటే ఉన్న విద్యార్థులకు కూడా విద్యను దూరం చేసే విధంగా ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ప్రభుత్వం స్థిరత్వం లేకుండా ఒకసారి సిబిఎస్ సిలబస్ అంటూ మరో సారి బ్రిటిష్ కౌన్సిల్ అంటూ ఇంకోసారి టాఫెల్ అంటూ మొన్న బైజ్యూస్ తాజాగా ఐబి అంటూ తెరమీదకి తీసుకువచ్చారన్నారు. స్థిరత్వం లేకుండా రోజుకో మాట మారుస్తూ ఉపాధ్యాయుల్లో విద్యార్థుల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్లస్ టు పాఠశాలలు ఫెయిల్యూర్ అయ్యాయని ఎక్కడ కూడా అడ్మిషన్లు జరగటం లేదన్నారు. నిజంగా గ్రామీణ విద్యార్థులు, పేద విద్యార్థులపైన ప్రేమ ఉంటే 500 విద్యార్థులు ఉండే హైస్కూల్లో ప్లస్ టు విధానాన్ని ప్రవేశపెట్టి అర్హులైన ఉపాధ్యాయులను జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి కల్పించి అడ్మిషన్లు చేపిస్తే తప్పకుండా ప్లస్‌టూ విధానం విజయవంతం అవుతుందని తెలిపారు. ఉపాధ్యాయులతో వెట్టి చాకిరి చేయించుకోవాలనే ఆలోచనలు విడనాడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు సంబంధించిన సరెండర్ లీవ్ బిల్లులు ఏడాది కాలంగా దాదాపు రూ. 800 కోట్లు ఉన్నాయని తక్షణమే మంజూరు చేయకుంటే రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమించడానికి వెనకాడబోమని హెచ్చరించారు. వీటికి తోడు ఉపాధ్యాయుల జీవిత బీమా రుణాలు, మెచ్యూరిటీ నగదుగా పెండింగ్‌లో ఉన్నాయని చెల్లింపులు చేయాలన్నారు. ప్రభుత్వం గత మూడు మాసాలుగా రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మంది బదిలీ అయిన ఉపాధ్యాయులకు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జీతాలు పెండింగ్‌లో ఉంచారన్నారు. పెండింగ్‌లో ఉంటే హౌసింగ్ లోన్లు పర్సనల్ లోన్లు వెల్ఫేర్ వాయిదాలు చెల్లించుకోలేక బ్యాంకులకు పెనాల్టీ కడుతూ చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ ఉన్న జీతాలు చెల్లించకుంటే మరోసారి ఉద్యమిస్తామన్నారు. ఈ ప్రభుత్వంలో చట్టప్రకారం రావాల్సిన జీతాలు కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి నెలకొనటం అత్యంత భాదాకరమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాడు పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో సిపిఎస్ రద్దు పాత పెన్షన్ పునరుద్ధరణ హామీ మాట తప్పి మరిచారని గుర్తు చేశారు. సీపీఎస్‌ను జీపీఎస్‌ను ఉద్యోగులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దుపై మాట తప్పామని మీరు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని బహిరంగంగా చెబితే 13 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు పాత పెన్షన్ విధానాన్ని ఎవరి మేనిఫెస్టోలో చేర్చితే వారికి మేమంతా ముకుమ్మడిగా మద్దతు ఇస్తామని తెలిపారు. 13 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు వారి వెనుక ఉన్న దాదాపు 60 లక్షల పైచిలుకు ఓట్లను వదులుకుంటారో అమలు చేస్తారో తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ బదిలీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విధానం కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడవడమే అని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల దగ్గర దబ్బులతో వ్యాపారం చేసుకుంటున్నారని మధ్యవర్తుల ద్వారా మూడు లక్షల నాలుగు లక్షల రూపాయలు వసూలు చేసి సిఫార్సు బదిలీలు చేస్తున్నారని వ్యవస్థకు మంచిది కాదని తక్షణమే నిలిపివేయాలని హెచ్చరించారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల ఉద్యోగుల పట్ల నిరంకుశంగా పనిచేస్తుందని మండిపడ్డారు. విద్యాశాఖపై రాష్ట్ర విధ్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులు కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ప్రవీణ్ ప్రకాష్ విధ్యాశాఖాధికారులను సాధారణ ప్రజల మధ్య అవమానిస్తూ ఉపాధ్యాయులను తిట్టే సమయంలో వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారన్నారని వ్యవస్థకు మంచి పద్ధతికాదని హెచ్చరించారు. నిజంగా ప్రభుత్వ పాఠశాలను బాగు చేయాలనుకుంటే ఉపాధ్యాయులకు విద్యశాఖాధికారులకు ఏమి చెప్పాలనుకున్నారో నాలుగు గోడల మధ్య స్టాఫ్ మీటింగ్ పెట్టి చెప్పాలని తెలిపారు. ప్రవీణ్ ప్రకాష్ అతని తీరు మారకుండా ఇదేవిధంగా కొనసాగిస్తే ఉపాధ్యాయ సంఘాలు పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. అనంతపురం జిల్లా మారుమూల ప్రాథమిక పాఠశాలలో బుక్‌లో ఒక్కపదం తప్పు ఉన్నందుకు 5గురు ఉపాధ్యాయులను అమరావతికి పిలిపించటం సరైన విధానమేనా అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిరంకుశ దోరణి వీడి ఉపాధ్యాయులు ఉద్యోగుల పట్ల హుందాగా ప్రవర్తించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన జీతాలు, అలివెన్స్ సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులపైన ఉపాధ్యాయులు పైన ప్రభుత్వ విధానాలు సక్రమంగా లేకుంటే వ్యవస్థకే చెడ్డ పేరు వస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో సెప్టెంబర్ 25,26,26 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మీక సంఘం (బికెఎంయు) 22వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి వేల సంఖ్యలో పాల్గొనే మహాసభలకు ఆహ్వానిస్తున్నామని తప్పక హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ జిల్లా గౌరవాధ్యక్షులు నర్రా సుబ్బారావు, జిల్లా ప్రధానకార్యదర్శి గుడివాడ అమరనాథ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్, ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వి.ప్రభాకర్, జిల్లా ఉపాధ్యయవాణి కన్వీనర్ పివి నాగరాజు, మైనార్టీ కన్వీనర్ సుభాని, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ ఉదయశంకర్, గవిని శ్రీనివాసరావు, ఏసుదాసు,నారాయణ, చంద్రశేఖర్, ఏసురత్నం,మండే ప్రభాకర్ రావు, పరిశుద్ధరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

సుబ్బారావు కుటుంబీకులకు నారాయణ పరామర్శ

తన్నీరు సింగరకొండ, ఎఎల్ నారాయణ, వెంకటరావు, ప్రకాష్‌తో నారాయణ

నారాయణతో చిరుమాల ప్రకాష్, మేదా వెంకటరావు, అచ్యుతుని బాబురావు, శ్రీమన్నారాయణ

సుబ్బారావు కుటుంబీకులతో సీపీఐ నారాయణ

విశాలాంధ్ర - చీరాల : చీరాలలోని తన చిన్ననాటి స్నేహితుడు పన్నెం సుబ్బారావు భార్య పన్నెం శ్రీవల్లి ఈ నెల 21 తేదీన మరణించాగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆదివారం పరామర్శించారు. చీరాల జాండ్రపేటలో సుబ్బారావు ఇంటికి వెళ్లి శ్రీవల్లి చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబీకులతో కొంతసేపు ముచ్చటించి యోగాక్షేమాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణతో పలు విషయాలపై చర్చించారు. వ్యవసాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిరుమల ప్రకాష్, సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు అచ్యుతుని బాబురావు, సీపీఐ పట్టణ కార్యదర్శి సైకం రాజశేఖర్, సుబ్బారావు, చేనేత జన సమైక్య నాయకులు మాచర్ల మోహనరావు,కృష్ణ మోహన్,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు రైతులు అందుకోవాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని కావూరివారిపాలెం పంచాయతీలో ఉద్యానవన శాఖ చీరాల డివిజన్ హెచ్ఓ అలేఖ్య ఉద్యానవన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను రైతులు అందుకోవాలన్నారు. తైవాన్ స్పేయర్లు 40 శాతం సబ్సిడీతో రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉద్యానవన పంటలు అయిన పూల తోటలుకు హెక్టారుకు రూ. 16 వేలు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి, రైతు భరోసా కేంద్రం అధికారిణి ఏమేలియ, భోగిరెడ్డి పిచ్చిరెడ్డి, ఆసోది బంగారు రెడ్డి, రైతులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట: ఎంపీలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీలు మోపిదేవి వెంకటరమణారావు, బీదా మస్తాన్ రావు అన్నారు. కూచినపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం మండల కేంద్రమైన నిజాంపట్నంలోని నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు భవనం అవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్‌గా పందరబోయిన బసవపున్నారావు, వైస్‌చైర్మన్‌గా కొలసాని కోటేశ్వరరావు పాటు 12 మంది డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిధులుగా హాజరైన ఎంపీలు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయమే దండగన్న చంద్రబాబు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారని చెప్పారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేనివిధంగా సీఎం వైఎస్ జగన్ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తు రైతులను అన్ని విధాల ఆదుకుంటున్నారని తెలిపారు. దానిలో భాగంగా రైతులకు రైతు భరోసా కింద ఆర్థిక సహాయం అందించడం, రైతుల పంటకు ఇన్సూరెన్స్ నష్ట పరిహారం, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, ఎరువులు విత్తనాలు అందించడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఆర్థికంగా రుణాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. రైతు మేలుకోరే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనని చెప్పారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా అందరి మంచి కోరే జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. నూతన పాలక వర్గం నిష్పక్షపాతంగా పనిచేసి రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్ బాబు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, నగరం ఎంపీపీ చింతల శ్రీ కృష్ణయ్య, నేతలు మదన్, వాసుదేవ, సచివాలయల కన్వీనర్ నాజర్ ఖాన్, బోటు యూనియన్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, సర్పంచ్ పోలేరమ్మ, అగ్రికల్చరల్ మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తొలగించే ఓట్లపై పునఃవిచారణ

విశాలాంధ్ర - వేమూరు : నియోజకవర్గంలో ఓటర్ల సవరణపై జరిగిన విచారణలో తొలగింపబడే ఓటర్లపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పు:న విచారణ జరుపుతున్నట్లు వేమూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, జిల్లా పరిషత్ సీఈవో జల్లి మోహన్ రావు తెలియజేశారు. ఆదివారం వేమూరు తాసిల్దార్ కార్యాలయంలో బిఎల్‌వోలు, ఈఆర్వోలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం, చావలి,వేమూరు ,గ్రామాలలో తిరిగి, పు:నవిచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సవరణల విచారణలో భాగంగా నియోజకవర్గంలో 12,597 తొలగింపులు వచ్చాయన్నారు. అయితే వీటిలో 8,737 మరణాలు ఉండగా, 1,786 డబల్ ఎంట్రీలు ఉన్నాయని మరో 2057 ఓట్లు గ్రామాల్లో ఉండని వారు ఉన్నారని వివరించారు. అయితే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ తొలగింపులపై పు:న విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలియజేశారు. గ్రామాల్లో బిఎల్వోలు ఓట్ల తొలగింపులపై పటిష్టంగా పరిశీలన చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. పు:నవిచారణ పూర్తి అయిన తర్వాత తొలి జాబితా ప్రకటిస్తామని, దానిపై అభ్యంతరాలకు సమయం కూడా ఉంటుందన్నారు. గ్రామాల్లో ఉండి ఓట్లు సవరణలో పొరపాటున తొలగించబడితే తిరిగి ఫారం సిక్స్‌ల ద్వారా ఓట్లను పునరుద్ధించడం జరుగుతుందని మోహన్ రావు వివరించారు. తాసిల్దార్లు బిఎల్‌వోలతో పు:నవిచారణ పటిష్టంగా చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతోపాటు వేమూరు, అమృతలూరు భట్టిప్రోలు, తాసిల్దార్‌లు నాగరాజు, మెహర్ బాబు, వెంకటేశ్వరరావు, బిఎల్‌వోలు ఉన్నారు.

ఎంఎం కొండయ్య ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో ఉన్న శ్రీ మహలక్ష్మమ్మ అమ్మవారిని, శీతలాంబ అమ్మ వారి బొడ్డు రాయిని చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి ఎంఎం కొండయ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖ శాంతులతో చల్లంగా ఉండేలా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు రాయి కమిటీ కార్య నిర్వాహకులు చుండూరు వెంకట స్వామి, ఎస్.ఎఫ్.సి. చుండూరు సాంబయ్య, విష్ణుమొలకల మధుబాబు, కటకం స్వర్ణయ్య, చుండూరు రామ సుబ్బారావు, కొలసాని సుబ్బారావు, కటకం శ్రీను, నల్లారి నాగరాజు, మలిశెట్టి వెంకట్రావు, తన్నీరు రాము, చుండూరు శివ శ్రీనివాసరావు, గొల్లపూడి ఆంజనేయులు, బత్తిన నారాయణ, కౌతరపు జనార్ధనరావు, తేలప్రోలు నాగేశ్వరరావు, గజవల్లి శ్రీనివాసరావు, కీర్తి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పద్యానికి గొడుగు పట్టిన ఘనత సృజనదే

విశాలాంధ్ర-అద్దంకి ; పద్యశాసనాన్ని రక్షించి, పద్యానికి గొడుగు పట్టిన ఘనత అద్దంకి సృజన సాహితీ సంస్థకు దక్కుతుం దని మాజీ ఉపసభాపతి ప్రపంచ తెలుగు మహాసభల గౌరవ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సృజన 27వ వార్షికోత్సవ సభ ,పద్యశాసన ప్రతికృత ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం స్థానిక శ్రీనివాస ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు జరిగింది. ముందుగా కమలేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న పద్యశాసనానికి,ఎర్రన విగ్రహానికి ,సరస్వతి మాత విగ్రహాలకు పూలమాలు సమర్పించారు. సభలో 60మంది కవులు తమ కవితాగానం చేసి సభికులను అలరించారు. సృజన ఆవిర్భావం నుండి నేటి వరకు జరిగిన సాహిత్య సమావేశాల గురించి సమస్త సమాచారాన్ని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన సృజన సాహితీ వైభవం గురించి ఆర్,రాఘవరెడ్డి ప్రసంగించారు. వీరవల్లి రుద్రయ్య సమర్పిత జీవిత సాఫల్య సృజన సాహిత్య పురస్కారాన్ని మండలి బుద్ధప్రసాద్‌కు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, వీరవల్లి రుద్రయ్య,దేవపాలన,గాడేపల్లి దివాకరదత్తు,సృజన వ్యవస్థాపక అధ్యక్షులు భూసరపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం ఘటన అమానుషం

విశాలాంధ్ర - బాపట్ల : రెండు కుటుంబాల మధ్య జరిగిన వాగ్వాదంపై సరైన విచారణను పోలీసులు చేయలేకపోగా గ్రామస్తులందరిపై దాడి చేయటం అమానుషమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. వేటపాలెం మండలం రామాపురంలోని 160 మందిపై అక్రమ కేసులు బనాయించడాన్ని బీసీ సంక్షేమ సంఘం నేతలు ఆదివారం ఖండించారు. శిఖరంవారివీధిలో ఆయన మాట్లాడుతూ వేటపాలెం మండలం రామాపురంలో తోడుకోడళ్ల మధ్య జరిగిన వాగ్వాదం పోలీస్ స్టేషన్లో చేసిన ఫిర్యాదు పై విచారణకు వచ్చిన పోలీసులు దురుసుగా ప్రవర్తించడంతో స్థానికులు మధ్య జరిగిన వివాదం 160 మందిని జైలు పాలు చేయటం బాధాకరమన్నారు. తెలియక పొరపాటు చేశామని వేడుకుంటున్నా వారిని తీవ్రంగా కొట్టడం దారుణమన్నారు. మాలో ఎవరో కొంతమంది తప్పు చేస్తే మమ్మల్ని ఈ విధముగా హింసిస్తారా.. కొడతారా అంటూ ఆవేదన వ్యక్తం చేసిన గర్భిణీ స్త్రీలను సైతం వదలకపోవడం శోచనీయం అన్నారు. మానవత్వం చూపని పోలీసు సిబ్బంది పైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రామాపురం ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని పోలీస్ ఉన్నతాధికారులకు తమ విజ్ఞప్తి తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మారం రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు తాతయ్య, జిల్లా న్యాయ సలహాదారుడు ఎ.నటరాజన్, నేతలు తెల్ల మేకల యశ్వంత్, మారం భాను, భాస్కర్, సాంబయ్య, పాశం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - వేటపాలెం : రోటరీ క్లబ్, 1992 టెన్త్ క్లాస్ బ్యాచ్ విద్యార్థులు, జిల్లా అందోత్వ నివారణ సంస్థ సంయుక్తంగా వేటపాలెం జూనియర్ కాలేజీలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎం సుధీర్ కుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పెదకాకానికి చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బిపిన్, డాక్టర్ రుతుజా పరీక్షలు నిర్వహించారు. 165 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా శుక్లాల ఆపరేషన్ చేసేందుకు 66 మందిని ఎంపిక చేశారు. తొలి విడతగా ఆదివారం పెదకాకాని శంకరయ్య ఆసుపత్రికి 38 మందిని బస్సులో తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బట్ట మోహన్ రావు, కార్యదర్శి ఏవి సురేష్, కోశాధికారి కోటేశ్వరరావు, రోటరీ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ గొల్లపూడి సీతారాం, సభ్యులు కారంచేటి శివరామకృష్ణ, కొత్త వాసు, నున్న నాగేంద్రరావు, పొగడ దండ రవికుమార్, ప్రతి వెంకట సుబ్బారావు, ఖదీర్ భాష, దివి పవన్,వెంకటేశ్వర్లు, పద్మనాభుని శ్రీనివాసరావు, దోగుపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరి గృహప్రవేశానికి 'ఆమంచి'

విశాలాంధ్ర- పర్చూరు: ఇంకొల్లుకు చెందిన కొల్లూరి శివాజీ చౌదరి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఆదివారం పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరివెంట పోపూరి మోహనరావు, రావి పేరయ్య, చిగురుపాటి శ్రీనివాసరావు, చలమయ్య, ధనుంజయరావు, షేక్ ఇమ్రాన్ ఆలీ, జెట్టి శంకరరావు ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - మార్టూరు : గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చిలకలూరిపేట కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో , ధీర హాస్పిటల్ ఉయ్యూరు,చిలకలూరిపేట అమ్మ దంత వైద్యశాల,ఒంగోలు స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ సంయుక్త సహకారంతో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాదాపు 30 మంది కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న పేషెంట్లు అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగానే చేస్తామని ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డులు తీసుకొని రావలసిందిగా డాక్టర్ కొమ్మినేని వీరశంకర్ రావు చెప్పారు. రోటరీ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రతిపాటి సురేష్ రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు,ఎఫర్ట్ అధినేత జాష్టి మోహనరావు మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ మిత్రులు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన సభ్యులు అందరూ విరివిగా పాల్గొన్నారు.

తెలుగు భాషా వికాసంలో బాపట్లది అద్వితీయ పాత్ర

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తెలుగు భాషా వికాసంలో బాపట్ల ది అద్వితీయమైన పాత్రను పోషించిందని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ బాపట్ల కవులు ఎందరో తెలుగు భాషను సుసంపన్నం చేశాన్నారు. తెలుగు భాషార్చన చేసిన బాపట్ల కవులలో రాయప్రోలు, తుమ్మల,జాషువా అగ్రగన్యులు అన్నారు. బాపట్ల తెలుగు తల్లి పుట్టినిల్లు తెలుగు తల్లికి బాపట్ల జీవం పోసిందని తెలిపారు. తెలుగు సాహిత్యం బాపట్లలోనే ఓనమాలు దిద్దుకుందని తెలుగు పద్యం బాపట్ల గడ్డ మీదే పుట్టి తెలుగుకు కావ్య భాష హోదా కల్పించిదన్నారు. తెలుగు పద్య మహాసౌధానికి పునాది రాళ్లు మోసింది బాపట్ల వాసులే అని గుర్తు చేశారు. తెలుగు భాషామ తల్లి కంఠంలో పలువురు బాపట్ల కవులు మల్లెపూదండలు వేశారు. తెలుగు వాంగ్మయ చరిత్రలో లేఖా సాహిత్యానికి శ్రీకారం చుట్టి బాపట్ల కవయిత్రి కనుపర్తి వరలక్షమమ్మ అని తెలిపారు. తెలుగు భాష అభివృద్ధిలో బాపట్ల పట్టణం ప్రముఖ పాత్ర పోషించిందని తెలిపారు.

శుద్ధజల ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర-పర్చూరు: రోటరీ సహకారంతో శుద్ధజల ప్లాంట్ ఏర్పాటు అభినందనీయమని రోటరీ సీడీజీ జాస్తి రంగారావు తెలిపారు. మండలంలోని నాగులపాలెం చెరువు వద్ద అధునీకరించిన నాగులపాలెం గంగను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోటరీ సేవలలో అంతర్భాగమైన సమగ్ర గ్రామీణాభివృద్ధి సేవా సంస్థ(సపోర్టు) ఆర్థిక సహకారంతో నిర్మితమైదని తెలిపారు. ప్రవాసాంధ్రులు, ప్లాంట్ వ్యవస్థాపక దాతలు ముద్దన హరిబాబు మాట్లాడుతూ ప్లాంట్ సజావుగా కొనసాగించటానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు నాగభైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, సపోర్టు ప్రతినిధులు పోలిశెట్టి చంద్రం, పాబోలు వెంకన్న, కాసా అశోక్‌కుమార్, సర్పంచ్ దాసి సుధారాణి, ఎంపిటీసీ మెరుగోలు సరోజిని, ఉపసర్పంచ్ అడ్డగడ రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ కొల్లా సుభాష్, కార్యదర్శి పఠాన్ మహబూబ్‌ఖాన్, రోటరీ ప్రతినిధులు కేఎస్‌ఆర్‌కే ప్రసాద్, పాబోలు ఉదయభాస్కర్, కోమటి ఆంజనేయులు, తోకల కృష్ణమోహన్, కె కొండల నాయుడు, కె సత్యనారాయణ, ఏజీజీకే రెడ్డి, తేళ్ళ రమేష్‌చంద్ర, భవనం రాజగోపాలరెడ్డి, గ్రామస్థులు అడ్డగడ కుప్పస్వామి, చాగంటి నాగేశ్వరరావు, అడ్డగడ సతీష్‌బాబు, కొల్లా శివరామకృష్ణ ఉన్నారు.

గోవాలో స్టాల్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - బాపట్ల : అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ గోవాలో జరగనున్నందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రకటన మేరకు రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 నవంబర్ 20 నుండి 28 వ తేదీ వరకు గోవాలో జరిగే ఫిల్మ్ బజార్‌లో రాష్ట్రం తరుపున ప్రత్యేక ప్రదర్శన స్టాల్ ఏర్పాటు కొరకు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఆసక్తిగలవారు ఏపీ ఎస్ ఎఫ్ టీవీ టిడిసి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర సమాచారం కొరకు సెల్ నంబర్ 9205007369, 9205970036 లను సంప్రదించాలని ఆయన కోరారు.

చంద్రయాన్ ఫలితాలు సామాన్యులకు అందాలి

విశాలాంధ్ర - చీరాల : చంద్రయాన్ ఫలితాలు కార్పొరేట్ శక్తులకు కాకుండా సామాన్య పేద వర్గాలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం చీరాల సీనియర్ సిటీజన్స్ కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక, సీనియర్ సిటీజన్స్ సంయుక్త ఆధ్వర్యంలో చంద్రయన్-3 తరువాత ఏమిటి అనే అంశంపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ స్వతంత్ర అనంతరం నెహ్రూ ఇస్రో లాంటి అనేక ప్రభుత్వ సంస్థలు స్థాపించి ఆనాడే చంద్రయన్ విజయానికి పునాదులు వేశారన్నారు. 14రోజుల పరిశోధన అనంతరం కలిగే ప్రయోజనాలుదేశంలోని సామాన్య ప్రజలకు అందించాలని యజ్ఞాలు, హోమాలంటు సైన్సు సాంకేతికత సాధించిన విజయాల్ని మతంతో మిళితం చేసి దేశ ప్రజలను మూఢనమ్మకాల వైపు నడిపించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో గాదె హరిహరరావు,సింహాద్రి యలమందరెడ్డి,కట్టా రాజ్ వినయ్ కుమార్,అత్తలూరి రామారావు,నాగ విరాభద్రాచరి, మస్తాన్ రావు, రవికుమార్, పల్లపోలు లోహియా తదితరులు పాల్గొన్నారు.

యానాదుల ఐక్యతా జయభేరి జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : బాపట్ల మండలం ఈతేరు పంచాయతీ పరిధిలో ఉన్న మనోహరంపురం యానాది కాలనీలో పొలిటికల్ ఫోరం కన్వీనర్ ఎందేటి వెంకట సుబ్బయ్య పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ 9 వ తేదీన గుంటూరులో కాసు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగే యానాదుల రాజకీయ భేరి మీటింగ్ విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బాపట్ల బ్రహ్మయ్య , రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లూరి శ్రీనివాసరావు,జిల్లా అధ్యక్షులు చౌటూరి రమేష్ తదిరులు పాల్గొన్నారు.

నేలవాలిన విద్యుత్తు స్తంభాలు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలో ఆదివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో సంగుపాలెం ఛందోలు మధ్య 33కెవి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పిట్టలవానిపాలెం మండలంలో అన్ని గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు ఏఈ చంద్రశేఖర్ తన సిబ్బందితో విద్యుత్తు పు:నరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొల్లూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 29న ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఐ సత్యనారాయణ రావు ఆదివారం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2. 30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని, నివేదికల తో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.